

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన కార్తీక్ నేచర్స్ స్పేస్ వెంచర్‌వాసులు

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

షాపూర్‌నగర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం సూరారం డివిజన్‌కు చెందిన కార్తీక్ నేచర్స్ స్పేస్ వెంచర్‌వాసులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలు అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్లు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక్ నేచర్స్ స్పేస్ వెంచర్‌లో మౌలిక సదుపాయాలకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్డులు పనులకు వ్యయ ప్రణాళికలను రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు కళ్యాణ్ రాజు, అనీల్‌కుమార్, వెంకట్‌రెడ్డి, పవన్‌మూర్తి, తిరుపతి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వర రావు, భాస్కర్, యోగేందర్ తదితరులు ఉన్నారు.

● ప్రజా సమస్యలను తన దృష్టికి తేవాలి

పేట్‌బషీరాబాద్: ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని వెంకన్నహిల్స్ కాలనీ ఫేజ్-2 సంక్షేమ సంఘం సభ్యులు దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో కలిశారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన జోనల్ కమిషనర్



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న జడ్సీ అపూర్వ్‌చౌహాన్

కుత్బుల్లాపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్ ఆదివారం పరిశీలించారు. ఈనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అభివృద్ధి పనులకు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. జీహెచ్‌ఎంసీ నిర్మిస్తున్న ఎస్‌ఆర్‌నాయక్‌నగర్ ఇండోర్ స్టేడియంను పరిశీలించారు. డీసీ నర్సింహ, ఎస్‌ఈ చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత తాగునీటి సరఫరాతో ఇబ్బందులు

అల్లాపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమవుతోందని, అవి తాగడానికి పనికొచ్చేవిగా లేవని స్థానికులు వాపోతున్నారు. రాజీవ్‌గాంధీ నగర్‌లో రెండు రోజులకొక సారి సరఫరా అయ్యే నీరు డ్రైనేజీ వాసన, బురదనీటి మాదిరిగా సరఫరా అవుతున్నట్లు తెలిపారు. కలుషిత తాగునీరు నిత్యం తాగడంతో ఉదర వ్యాధుల బారిన పడుతున్నట్లు తెలిపారు. దీంతో ఆ ప్రాంతమంతా 'వాటర్ బబుల్స్' కొనుక్కుని తాగుతున్నామని అంటున్నారు. రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దర్ నగర్‌ప్రాంతాల్లో నివసించేది ముఖ్యంగా పేదవారవటంతో అక్కడ ఎక్కువగా నేరుగా కుళాయి నీళ్లనే తాగేందుకు వినియోగిస్తున్నారు. జలమండలి అధికారులు దృష్టి సారించి నాణ్యమైన నీరు సరఫరా అయ్యేలా చూడాలంటూ వేడుకుంటున్నారు.

ముప్పా సుబ్బయ్యకు ఎమ్మెల్యే నివాళి



సుబ్బయ్య పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ముప్పా సుబ్బయ్య శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మదీనాగూడ సమీపంలో మైత్రీనగర్‌లోని ముప్పా సుబ్బయ్య నివాసంలో ఆయన పార్థీవదేహానికి ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నివాళులర్పించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సతీష్‌అరోరా, సాయిబాబుచౌదరి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కూకట్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మూసాపేటలోని వార్డు కార్యాలయంలో డా.సౌజన్య, డా.మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానికులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. శిబిరాన్ని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పరిశీలించారు. మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో కూడా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌గౌడ్, శైలేష్, మనోహర్, ఎర్రస్వామి, ఐలయ్య, రవిగౌడ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

నిజాంపేట్: ఉచిత ఆరోగ్య శిబిరాలు వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని తార సంస్థ నిర్వాహకులు శివగణేష్ అన్నారు. బాచుపల్లి కేఆర్‌సీఆర్ కాలనీ రోడ్డు-4, సాయి తరంగిణి అపార్టుమెంట్‌లో మెడికవర్ ఆస్పత్రి, శ్రీ క్లీనిక్ జేబీనగర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హెల్త్ శిబిరం నిర్వహించారు.



రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మత్స్యకారుల సొసైటీ సంఘం సభ్యులు

మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజు

షాపూర్‌నగర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా మత్స్యకారుల సంఘం (డీఎఫ్‌సీఎస్) జిల్లా అధ్యక్షుడిగా సూరారానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మన్నె రాజు ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా గాజులరామారం మత్స్యకారుల సంఘం సభ్యులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. రాజును కలిసిన వారిలో సొసైటీ ప్రెసిడెంట్ యాదగిరి, జనరల్ సెక్రటరీ ఈగ అంజనేయులు, ఉపాధ్యక్షుడు వి.జీతయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి శ్రీనివాస్ ట్రెజరర్ యాదయ్య, సభ్యులు దుర్గయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగలకు న్యాయం



జెండాను ఎగురవేస్తున్న దళిత నాయకులు

నిజాంపేట్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా దళిత సంఘం నాయకులు కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎంఎస్పీ పార్టీ, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరి మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరగబోతుందని, దీని వల్ల దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రమేష్, సలోమి, కురుమయ్య, నీరంజన్, కిషన్, జార్జ్, వెంకటేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

షిరిడీనగర్ కాలనీ సమస్యపై కార్పొరేటర్ పాదయాత్ర



షిరిడీనగర్ కాలనీలో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ షిరిడీనగర్ కాలనీలో విద్యుత్, డ్రైనేజీ నాలాకు సంబంధించిన సమస్యలున్నాయని కాలనీ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఆయన ఆదివారం కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ షిరిడీనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మార్పే విషయాన్ని విద్యుత్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మోజెష్, సీహెచ్ శ్రీధర్, మూర్తి, అమరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌సింగ్, సురేష్, సాయిబాబా, కరుణాకర్, సారంగపాని, శ్రీనివాసరావు, సాయి కుమార్, చంద్రమౌళి, అశోక్, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

కూకట్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రాంతం శ్రీకృష్ణుడి నామస్మరణతో మార్మోగింది. ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లిలో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. హైదర్‌నగర్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ వరకు జరిగిన ఈ యాత్రలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రథంపై ఉన్న స్వామికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. స్వామివారి రథాన్ని తాడుతో లాగేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు. మహిళలు కోలాటం ఆడుతూ యాత్రలో ముందుకు సాగారు.

ఫతేనగర్: ఫతేనగర్‌లోని హిందూ సేవా సంఘ్ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయం వద్ద ఆదివారం చేపట్టిన జగన్నాథ రథయాత్ర ప్రత్యేక పూజల్లో ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొన్నారు. పూజల్లో భాగంగా సేవా సంఘం అధ్యక్షుడు, యాత్ర ఇన్‌చార్జి ప్రమోద్‌మోడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● అంగరంగ వైభవంగా రథయాత్ర

హైదర్‌నగర్: కూకట్‌పల్లిలో జగన్నాథ రథయాత్ర పూరిని తపలించేలా నయనానందకరంగా సాగింది. కూకట్‌పల్లి అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో శాఖ డైరెక్టర్ మహా శృంగదాస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదర్‌నగర్ విజయలక్ష్మి దేవాలయం నుంచి ప్రారంభమైంది. రథయాత్ర నిజాంపేట్‌రోడ్, జేఎన్‌టీయూ చౌరస్తా, కేపీహెచ్‌బీ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, వివేకానందనగర్ మీదుగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక



రథయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు



కూకట్‌పల్లిలో జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న ప్రజలు



రథయాత్రలో పాల్గొన్న భక్తులు



భక్తుల కోలాటం



రథయాత్ర పూజల్లో కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో హిందూ సేవాసంఘ్ అధ్యక్షుడు ప్రమోద్‌మోడీ తదితరులు



అన్నదానం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్



నవోదయ కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

సమాజ సేవే శ్రీకృష్ణయూత్ మార్గం

మియాపూర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవే మార్గంగా శ్రీకృష్ణయూత్ ప్రతీఅడుగు ముందుకేస్తోందని యూత్ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలి టెలికాంనగర్ లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో శ్రీకృష్ణ యూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ తన సొంత ఖర్చులతో చిన్నారులకు క్రీడా పరికరాలను ఏర్పాటు చేశారు. వాటిని జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించి మాట్లాడుతూ శ్రీకృష్ణయూత్ చేస్తున్న సేవలను అభినందించారు.

● గచ్చిబౌలి డివిజన్ నవోదయకాలనీలో అసోసియేషన్ సభ్యులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ స్థానికులతో కలిసి పార్కులు, మౌలిక వసతులు కల్పించాలని పాదయాత్ర చేశారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● తప్పిన పెను ముప్పు
● ఐదుగురికి తీవ్రగాయాలు



డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

గాజులరామారం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా.. మిగిలిన వారు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. గాయపడిన వారు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల డిపోకు చెందిన టీజీఆర్టీసీ బస్సు బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి జీడిమెట్లకు వెళ్తుండగా సూరారం జ్యోతి మిల్క్ సమీపంలోనికి రాగానే అదుపు తప్పింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును కంట్రోల్ చేయడానికి డివైడర్ ఢీ కొట్టాడు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డవారిలో వనిత్ దత్తు(20), శిరీష(20), అమీన్‌బేగం(60), సక్కుబాయి(60), రషీద్(30) ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న మల్లారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు. గాయపడిన వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

● ట్రాఫిక్ జామ్

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు కావడం, ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొట్టడంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇదిలా ఉండగా.. బస్సు ప్రమాదం జరిగిన సమయంలో వెనుక నుంచి వస్తున్న కారు బస్సును ఢీకొట్టడంతో కారు ముందు భాగం దెబ్బతింది. దీంతో కారు యజమాని ఎండి జాఫర్ సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఎమ్మెల్యే గాంధీకి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

నల్లగండ్ల హుడాకాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

గచ్చిబౌలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడాకాలనీలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని కాలనీవాసులు ఆదివారం విజ్ఞప్తి చేశారు. కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పన కోసం తాను కృషిచేస్తానని, ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కాలనీ వాసులు శ్రీకాంత్, కిషోర్, రాజేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



పగిలిన పైప్‌లైన్ నుంచి వృథా అవుతున్న తాగునీరు

తాగునీరు రోడ్డు పాలు

గాజులరామారం: నూతన తాగునీటి పైప్‌లైన్‌లు అధికారులు ఏర్పాటు చేసేందుకు రోడ్డుపై గుంతలను తీస్తుండగా, పక్కనే ఉన్న మంచి నీటి పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథా అవుతుంది. గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురం చౌరస్తాలోని బాలయ్యబస్తీకి వెళ్లే ప్రధాన రోడ్డులో మూడు రోజుల నుంచి తాగునీటి పైప్ లైన్ పగిలి నీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నీరురోడ్డు పాలవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌ఓప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

గచ్చిబౌలి: గచ్చిబౌలి డివిజన్ గుల్‌మొహర్‌పార్కు కాలనీలో హెచ్‌ఎస్‌బీసీ ఇండియా, ది సోషల్ ల్యాబ్, యునైటెడ్ వే ఆఫ్ బొంబాయ్ సంయుక్త ఆధ్వర్యంలో కాలనీవాసుల కోసం వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటును ఆయన ప్రారంభించారు.

సీఏ విద్యార్థులకు మంచి భవిష్యత్

కేంద్రమంత్రి చంద్రశేఖర్



విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న కేంద్రమంత్రి చంద్రశేఖర్

గచ్చిబౌలి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కేంద్రమంత్రి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలి బాలయోగి ఇండోర్ స్టేడియంలో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సీఏ పూర్తిచేసుకున్న విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్ నుంచి దేశవ్యాప్తంగా 9 వేల మంది విద్యార్థులు సీఏ పూర్తి చేసుకున్నారని అన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు నైపుణ్యం పెంచుకునేందుకు ఎంతగానే ఉపయోగపడుతుందని వివరించారు. కష్టపడిన చదివిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులకు పట్టాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సీఏ పరీక్షలు కష్టతరమైనవని అలాంటి పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సెంట్రల్‌కౌన్సిల్ మెంబర్ శ్రీధర్, దయానివాస్‌శర్మతో విద్యార్థులు పాల్గొన్నారు.

విల్లా.. గుల్ల

● తాళాలు పగులగొట్టి చోరీ
● 40 తులాల బంగారం, లక్ష నగదు అపహరణ



దొంగలు చోరీ చేసింది ఈ విల్లాలోనే..

కొత్తపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): నగర శివారు ఫతుల్లాగూడ గేటెడ్ కమ్యూనిటీలోని ఓ విల్లాలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. నాగోలు ఎస్‌హెచ్‌ఓ సుధీర్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..

ఫతుల్లాగూడలోని గోల్డెన్ లీవ్స్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీలోని నెం.89 విల్లాలో విశ్రాంత పోస్టల్ ఉద్యోగి పురుషోత్తంరెడ్డి కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఇటీవలే కుమార్తె విదేశాల నుంచి రావడంతో అందరూ కలిసి ఈనెల 3న పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లారు. మరో విల్లా (నెం.22)లో ఉంటున్న నీరజారెడ్డి కుటుంబ సభ్యులు కూడా బంధువుల ఇంటికి వెళ్లారు. అయితే, శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు నంబర్ 89 విల్లా తాళాలు పగులగొట్టి బెడ్‌రూంలోని కప్‌బోర్డులో దాచిన 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న పురుషోత్తంరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం చూసి చోరీ జరిగినట్లుగా అనుమానించి కమ్యూటీ అసోసియేషన్ వారి సహకారంతో నాగోల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, అడిషనల్ డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, పోలీసు జాగిలాలు, క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. విల్లా ఎదురుగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు యువకులు చోరీచేసి వెళుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి.

● పని చేయని సీసీ కెమెరాలు

ఈ గేటెడ్ కమ్యూనిటీలో 54 సీసీ కెమెరాలు పనిచేయడం లేదని పోలీసులు గుర్తించారు. విల్లాల వెనుక మూసీ వైపు ఖాళీ ప్రదేశం ఉండడంతో ప్రహరీని సులభంగా దూకి దుండగులు లోనికి ప్రవేశించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చోరీచేసి పరారయిన దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా 3 సీసీఎస్ పోలీసుల బృందాలు, 3 ఎల్బీనగర్ జోన్ బృందాలు రంగంలోకి దిగాయని సమాచారం. ఇటీవలే కొత్తగూడెం వద్ద పార్థీగ్యాంగ్ సభ్యుల్లో ఇద్దరిని నల్లగొండ పోలీసులు పట్టుకున్న సంఘటనను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. ఆ గ్యాంగ్‌లోని మిగతా సభ్యులే గేటెడ్ కమ్యూనిటీ విల్లాలో చోరీ చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ గేటెడ్ కమ్యూనిటీలో చోరీ తీరుమాత్రం అందుకు భిన్నంగా ఉందని పోలీసుల అధికారులు అభిప్రాయపడుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ రామ్‌నారాయణ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ విద్యానగర్‌కు చెందిన భానోత్ తులసి కుమారుడు భానోత్ రాజేష్(28) బతుకు దెరువు కోసం వలస వచ్చి, కొంపల్లి అపర్ణ పాలమామెడోస్‌లోని సంజయ్‌అగర్వాల్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 6న ఉదయం 9 గంటలకు రోజూ మాదిరిగానే విధులకు వెళ్లాడు. రాత్రైనా రాజేశ్ ఇంటికి రాకపోయేసరికి కుమారుడికి తల్లిదండ్రులు ఫోన్ చెయ్యగా సమాధానం ఇవ్వలేదు. అప్పుడప్పుడు విధులకు వెళ్లి, లేటుగా వస్తాడనుకొన్నారు. 7వ తేదీ ఉదయం 4 గంటలకు సంజయ్‌అగర్వాల్ ఫామ్‌హౌజ్‌లో పని చేస్తున్న శ్రీను 'మీ కొడుకు మాట్లాడడం లేదు' రాజేశ్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలిపారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాజేష్ వద్దకు వచ్చి చూడగా మృతి చెంది ఉన్నాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ అడ్మిన్ ఎస్ఐ ధర్మేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దండు అప్పలరాజు(41) బతుకుదెరువు కోసం వలస వచ్చి నగరశివారు దూలపల్లి అయ్యప్ప కాలనీలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి ఇద్దరు పిల్లలున్నారు. ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసైన అప్పలరాజు శనివారం ఇంట్లోనే ఉన్నారు. అతడి భార్య రాజేశ్వరి కూకట్‌పల్లికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరు. ఆ సమయంలో అప్పలరాజు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన భార్య రాజేశ్వరికి భర్త ఉరివేసుకొని కనిపించాడు. దీంతో ఆమె పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పరికిచెరువులో రోడ్డు నిర్మాణానికి ప్రైవేట్ వ్యక్తుల యత్నం

● అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు ● తీవ్ర ఉద్రిక్తత ● కబ్జాలను అడ్డుకుంటాం: కూన శ్రీశైలంగౌడ్



కబ్జాలను అడ్డుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం, జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్ ప్రాంతంలోని పరికిచెరువు ఎఫ్‌టీఎల్‌లో కొందరు ప్రైవేట్ వ్యక్తులు సీసీ రోడ్డు నిర్మాణం చేయడానికి యత్నించడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నారు. ఈ క్రమంలో జగద్గిరిగుట్ట పోలీసులు రంగంలోకి దిగారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో ఆర్ఐ రజనీకాంత్ అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అక్కడి చేరుకుని చెరువును పరిశీలించారు. కొందరు వ్యక్తులు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని ఆక్రమించి, శ్మశానవాటికలను ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నాడని శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. చెరువును పరిశీలించిన శ్రీశైలంగౌడ్ దాదాపు 5 వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించారని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరికిచెరువులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను తక్షణమే నిలిపివేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మెన్ లక్ష్మారెడ్డి, రషీద్, మోతే శ్రీనివాస్‌యాదవ్, గణేష్, ఓరుగంటి నరేష్‌గౌడ్, మధుసూదన్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు స్వాగతం



ఎన్టీఆర్ భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న టీడీపీ కార్యకర్తలు

కూకట్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబు నగరంలోని ఎన్టీఆర్ భవన్‌కు చేరుకునే వేళ కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఏపీకి నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి హైద్రాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు చంద్రబాబు ఆదివారం వచ్చారు. ఈ నేపథ్యంలో నందమూరి సుహాసిని, టీడీపీ యువసేన అధ్యక్షుడు హరి, సురేశ్‌బాబు, ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరూప్ నిమ్మగడ్డ జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా తెలంగాణ టీడీపీ కార్యకర్తలు చంద్రబాబును సత్కరించగా కార్యకర్తలను ఉద్దేశించి ఏపీ సీఎం మాట్లాడారు.